# కళ్యాణీ - కామితార్థ ప్రదాయినీ!

పాండు వర్ణసంశోభితాలైన ముగ్ధ మేఘాలు ప్రసవ వేదనతో ప్రకృతిని కరుణాప్లావితం చేస్తున్న ఓ శ్రావణ శుక్రవారం నాటి సాయంత్రం - నలుగురు పేరంటాళ్లూ నవ్వుకుంటూ త్రోసుకుంటూ, గాజుల గలగలలతో, పసుపు కుంకుమలతో, వేయించిన శనగలతో ఆ యింటినుంచి యీ యింటికి అడుగు వేసే సమయాన__

శ్రీమన్నారాయణ వంటరిగా ఇంటి ముందువున్న అరుగుమీద కాళ్ళు ముడుచుకు కూచుని, ఆందోళనతో, అవమానంతో, బాధతో, తనమీద తనకే అసహ్యంతో, ఇంటిలోపలకు వొకసారీ, బయట కరిగిపోతున్న నీడలవేపు ఒకసారీ పిచ్చిగా, అనాలోచితంగా చూస్తూ వెల తెల బోతున్నాడు.

లోపలనుంచి హృదయవిదారకమైన ఆర్తనాదం

వుండి, వుండి "ఎట్లా తల్లీ! ఇప్పుడే ధైర్యంగా వుండాలి. అన్నింటికీ ఆ శ్రీమన్నారాయణుడే వున్నాడు. ఏం భయం లేదు. డాక్టరుకు కబురు పంపించమంటావా?" అంటున్న వణికిపోతున్న ఒక ముసలిగొంతుక, ధైర్యం చెబుతున్నట్లుగా.

"ఊ... హూ... వద్దు" అంత బలహీనమైన మూలుగులోనూ దృఢంగా అసమ్మతి. శ్రీమన్నారాయణ కళ్ళు తుడుచుకున్నాడు పైమీది కండువాతో. అట్లా బుజంమీది కండువాను చేతిలోకి తీసుకోడంలో చినిగిన చొక్కా బయటపడింది. చినిగిన చొక్కాను చూసి, సానుభూతిని చూపిస్తున్న ఖాళీజేబు. తనలో తను మందంగా నవ్వుకుని కండువాను మళ్ళీ బుజంమీద వేసుకున్నాడు. మధ్యతరగతి గౌరవం మళ్ళీ ప్రాణం పోసుకుంది.

లోపలినుంచి బాధతో కూడిన మూలుగు మరీమరీ ఎక్కువౌతోంది. ఎదురింటి వారి రేడియోలో సుఖమూ, దుఃఖమూ కలిసిన ఏదో భాష తెలియని సంగీతం. నీడలు క్రమేపీ పొడుగు సాగుతున్నాయి. ఎదురింటి ఎర్రగన్నేరు చెట్టు నిద్ర కుపక్రమిస్తోంది. దూరంగా అనంతమైన శూన్యంలోంచి మాయాభరితమైన ప్రకృతిలోకి వస్తున్న దో తెల్లని పావురం.

"అబ్బాయ్! అమ్మాయ్ మరీ కష్టపడుతోందిరా. డాక్టరు అవసరం ఉంటుందేమో" నారాయణ యాంత్రికంగా తలూపాడు. అరుగుమీదనుండి క్రిందికి దిగి, రెండడు

గులు ముందుకు వేశాడు. మళ్లీ ఆగిపోయాడు. అతనిని చూచి అతనికే నవ్వు వచ్చింది; జాలి కలిగింది. "ఎందుకు వెళ్తున్నట్లు నేను? ఏం సాధించగలనని? ఆ డాక్టరుకు ఇవ్వవలసిన ఫీజుసంగతి తరువాత ఆలోచించుకోవచ్చు. ముందు ఆయనను యింటికి తీసుకురావడానికయినా దగ్గర చిల్లర డబ్బులు లేవే"

తన వ్యర్థత్వం తాను తెలుసుకున్న అతను అప్పటికే ఆసందు చివరికి వచ్చేశాడు. ఎదురుగా శివాలయం. మహాదేవునికి అప్పుడే అలంకారం పూర్తి చేసినట్లుంది. ఒకానొక మహత్కార్యార్థం నియోగింపబడిన వానిలా కన్పిస్తున్నాడు. శ్రీమన్నారాయణ అనుకోకుండానే ఆలయంలోకి వెళ్ళాడు. ధ్వజస్తంభం మీద ప్రణవస్వరాల్లా కదులుతున్న చిరుగంటలు... ప్రాకారాంతర్భాగంలో శుచిగా వో మూల కూచుని ఎవరో పఠిస్తున్న శివకవచం... శివునిపాదాల నలముకుంటూ పరిసరాలను పవిత్రం చేస్తున్న నందివర్ధనం పూలవాసనలు ఆ ప్రక్కనే మహాలింగానికి వెనుక ప్రక్క శివసాన్నిధ్యంలో అజయ్యుడై జీవిస్తోన్న మార్కండేయుడు... శ్రీమన్నారాయణ ఒక్క క్షణంసేపు ప్రకృ తాన్నే మర్చిపోయాడు. ఎదలో ఏదో కదిలినట్లయింది. మల్లెపువ్వు ప్రఫుల్లమైనట్లు, ఒకానొక శుభతార విచ్చుకున్నట్లు, ఒక నూత్న శిశువు జననమందినట్లు, మనసులో కొన్ని అస్పష్ట భావాలు. విభూతిధారణ మొనర్చుకుని, నంది పాదాల వద్ద కూర్చుని ఒకింత, ఇంటివేపు మరలబోయాడు.

"ఏం నాయనా కులాసాగా ఉన్నావా?"

సైకిలుమీద మందుపెట్టె, మొగాన విభూతి రేకలు, మధ్యన గంధాక్షతలు, కట్టుకున్నవి ఖద్దరు బట్టలు, గుండ్రని నవ్వుతోన్న మొహం, బట్టతల, ఆజానుబాహు విగ్రహం.

శ్రీమన్నారాయణకు కొంచెం ఆశ్చర్యం వేసింది. ఆయనను ఎప్పుడూ తను చూసిన జ్ఞాపకంలేదు. 'ఏమో మరి! తన యీ మూడుపదుల జీవితంలోనూ ఎందరెందరితోనో తను సహవాసం చేయవలసి వచ్చింది. ఎందరినో తను ఆశ్రయించవలసి వచ్చింది. ఈ శతకోటి జీవన ఘర్షణల్లోనూ, వీరితో తన కెప్పుడు పరిచయమయిందో' అభివందనం చేస్తూ "కులాసాగానే వున్నాం. మీ...రు..." అని మాటమధ్యలోనే తేల్చేశాడు.

ఆయన నిర్మలంగా నవ్వాడు. దూరంగా ఎక్కడో వో మబ్బుతునక జారిపోతూ చేసిన చప్పుడు. "అవును. నేను నీకు తెలీదు ఎట్లా తెలుస్తుందీ?_మీ నాయనగారు పోయే నాటికి ఇంకా నీకు ఉపనయనమన్నా జరుగలేదు. బహూ దొడ్డ మనిషి. తల్చుకున్నపుడల్లా చేయెత్తి నమస్కారం చేయాలనిపిస్తుంది. మీ యింట్లో భోజనం, అదే, వారాలు చేసుకుని చదువుకున్నాను. మీ నాయనగారు గుడ్డలిచ్చి, అడపా దడపా రూపాయో, అర్ధో చేతులో పెడుతూండే వారు."

"అలా చేయబట్టే నాకీనాడు ఇంత దుర్గతి పట్టింది" అనుకున్నాడు మనసులో శ్రీమన్నారాయణ. మళ్ళీ తన

లోని బలహీనతకు అతనిమీద అతనికే కోపమొచ్చిం(ది).
"ఛా! ఛా! ఇదేమిటీ ఇలా అనుకుంటున్నాను. వారి జీవితం ధన్యం చేసుకుని వారు వెళ్ళిపోయారు వారి జీవితము, ఆ ధన్యత్వము, ఆ పవిత్రత, ఆ అదృష్టము తనకు రమ్మన్నా రావు."

దేవాలయం ఎదురుగ్గా నిలబడి వారిద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఇంకా శివమూర్తి దృగ్గోచరమౌతూనే వున్నది ఆ శివమూర్తిలో తన పితృపాదుల స్వరూపం గోచరించింది నారాయణకు మనసులోనే తనను మన్నించమని వేడుకున్నాడు.

"క్షమించండి. మీ పేరూ..."

"పేరులో ఏముంది నాయనా. శంకరం అని నలుగురూ పిలుస్తుంటారు"

"అయ్యా! శంకరంగారూ. నన్ను మీరు క్షమించాలి. ఇట్లో ఆడవాళ్ళు నొప్పులు పడుతున్నారు..."

"అయ్యయ్యో! ఇక్కడ నుంచున్నావేం నాయనా. పద పద, నేనూ వస్తున్నాను పద. మీ నాయనగారి చలువ వల్ల నేను నేర్చుకున్న ఈ వైద్యం, నిల్పిన కొమ్మకే ఉపయోగకరమైతే, అంతకన్నా కోరదగిన అదృష్టం మరొకటి లేదు."

శంకరంగారు కృతజ్ఞతను ప్రకటించుకొన్నవారు ప్రకటించుకుంటూనే వున్నారు. అప్పటికి సూర్యుడు, వెలుగు ప్రక్కకు తప్పుకోడంలో, నీరెండలో మెరిసిపోతున్న ప్రకృతి

తలస్నానం చేసిన పుణ్యపురుషునిలా గోచరిస్తోంది. ఉన్నట్టుండి వెలిగన మునిసిపాలిటీవారి ఆరిపోని దీపాలు "ధర్మమూ ఇల్లానే జ్వలిస్తుంది" అన్నట్లు వెలుగుతున్నాయి మందమందంగా వీస్తోన్న చలిగాలికి గుమ్మాలమీద అల్లుకున్న కాగితపువ్వులు అడపాదడపా క్రిందకు రాల్తూ "అదృష్టమూ ఇంతే" అని చెప్పక పోతున్నాయి.

ఎక్కడో శుక్రవారం నోము పేరంటం పాట.... మెల్లగా పైకి పొంగుతోన్న జాబిలి నవ్వు మొహం... శ్రీమన్నారాయణలో స్పష్టాతిస్పష్టంగా సందేహావలయం. "ఆ పొరుగింటి ముసలమ్మ తను డాక్టరు దగ్గరకు వెళ్ళాడనీ, ఇంకా రావడంలేదనీ, వొట్టి జాగుమనిషి అనీ విసుక్కుంటుంటుంది గ మోసు! పిచ్చిది. ఇంతకూ లక్ష్మికి సుఖప్రసవమయిందా? ఏమో, ఆ ఆదిశంకరుడే వున్నాడు... తన కుటుంబం, తన నాన్నగారి కాలంలో అనుభవించిన వైభవాన్ని మాత్రమే ఎరిగివున్న శంకరంగారు, ఈనాటి తన బీదరికాన్ని, హైన్యాన్ని చూచి, అన్యథా భావించరు కదా!"

ఇంటిగుమ్మం ముందువరకూ వచ్చి, అక్కడ నెలకొన్న ప్రశాంతతను చూచి, ఆశ్చర్యంతో శ్రీమన్నారాయణ తనను తాను మర్చిపోయాడు సుస్వరయుతమైన, సుమధురమైన సంగీతం వినిపించి, వినిపించి, శూన్యత్వంలో అలుముకున్న ప్రశాంతిలాంటి ప్రశాంతి యది.

వీళ్ళను చూడగానే లోపలవున్న ఆ ముసలమ్మ ఖల్లు ఖల్లుమని నవ్వుకుంటూ బయటికి వచ్చింది. "అదృష్టవంతు

డివి బాబూ. అంతా సవ్యంగా జరిగింది ఆ రామయ్య తండ్రి మనపాలిట వున్నాడు బంగారబ్బొమ్మ చిదిమి దీపం పెట్టుకోవచ్చు ఆడపిల్ల అంటే లక్ష్మీప్రదం నాయనా.”

ఆమె మాటలు అతనికి విన్పించడం మానివేశాయి. తనవెంట ఒక అతిథి వున్నాడన్న సంగతే మర్చిపోయాడు. సర్వప్రపంచమూ పరమేశ్వరీరూపమైన ఒక బాలికగా అతనికి కనిపించసాగింది. “లక్ష్మీ!” అంటూ ఒక వెర్రి ఆనందంలో, ఒక పిచ్చి తన్మయత్వంలో లోపలకు పరుగెత్తాడు.

లోకకళ్యాణార్థం తపస్సు చేసి చేసి, లబ్ధఫల అయి, స్రుక్కి యున్న దేవతా స్వరూపంలా మంచానికి ఒక ప్రక్కగా లక్ష్మి ఆమె గుండెల్లోకి చొచ్చుకొని, ఆమె మాతృత్వాన్ని పిలుస్తూ వెచ్చగా, తియ్యగా, కాంతిగా, అద్దాల్లో ఓ బిడ్డ. ఆ బిడ్డ నవ్వుతోంది. అంతలోనే ఏడుపు. ఆ బిడ్డ కదులుతోంది. అంతలోనే నిశ్చలత. “లక్ష్మీ!” అంటూ అతను ప్రేమగా, అభిమానంగా పిలిచాడు. ఆ అలసిన కనురెప్పలు, మత్తుగా విచ్చుకొన్నవి. ఇంతలోనే “నారాయణగారూ” అంటూ బయటినుంచి ఎవరో పిలిచారు. సాగుతూ సాగుతూ వున్న సత్కావ్యరసం హఠాత్తుగా అగిపోయినట్లయి, అతను బయటికి రావలిసివచ్చింది.

బయట అతని స్నేహితుడు బ్రహ్మావధాని. “క్షమించాలోయ్! నిన్న సాయంకాలం నువ్వడిగితే ఇయ్యలేకపోయాను. ఇప్పుడే కుబేరుడు తెచ్చియిచ్చాడు. ఇదిగో పాతిక.”

శ్రీమన్నారాయణకు అంతా ఓ కలగా వుంది. కలలో కల ఈ ప్రపంచం సమస్తమూ. తను నిన్న సాయంకాలం వెళ్ళి యాచించనివాడు లేడు. ఆప్తమిత్రులనుకొన్న వారు నిస్సహాయతను ప్రకటించారు. ఈ హఠాత్సంఘటన... "వద్దోయ్" అని చెప్పాలనుకొన్నాడు. మళ్ళీ బ్రహ్మవధానే "వస్తానోయ్. ఏముంది" అంటూ జవాబుకైనా ఆశించకుండా ఆ పాతిక రూపాయలూ అతని చేతిలో పెట్టి, గుప్పిటమూసి వెళ్ళిపోయాడు.

శ్రీమన్నారాయణకు అంతా అగమ్యమై ఆ పుట్టిన బిడ్డవేపు చూసుకున్నాడు. అన్నీ తెలిసిన దేవుళ్ళాంటి ఏమీ తెలియని ఆ పసికందు కళ్ళుమూసుకుని నవ్వుతోంది. అప్రయత్నంగానే అతనా డబ్బును జేబులో పెట్టుకున్నాడు.

ఎక్కడో ఏ కోకిలమ్మ కుహూ కుహూ మంటున్నది... జోలపాట ఒకటి జోకొడుతున్నది ... ప్రకృతి యావత్తూ ఊయెల లూగుతోన్న ఊయెలవంటి ఆ జాబిల్లి వెల్లువలో పసిపాపయై కన్ను మలపకనే పాలకోన మేడుస్తున్నది.

శ్రీమన్నారాయణకు వున్నట్టుండి శంకరంగారుజ్ఞాపకానికి వచ్చారు. "అయ్యయ్యో! ఎంతటి మూర్ఖుణయ్యాను!" అని బహుకించబడ్డాడు. "వారిని అక్కడే నిలబెట్టాను" అనుకొని వాకిట్లోకి వచ్చాడు. ఆ ముసలమ్మ ఎదురై "వెళ్ళిపోయారు నాయనా, వారు ఎంత వుండమన్నా వుండకుండా. మరోసారి వస్తారట ఇవిగో ఈ నాలుగు

మాత్రలూ మాత్రం వేయమన్నారు అమ్మాయికి. ఇంక పథ్యమేమీ అక్కరలేదట. పిల్లకు కళ్యాణి అని పేరు పెట్టమన్నారు" అన్నది.

అక్కడికీ ఆ మాటలమీద నమ్మకం చాలక అతను వీధి చివరదాకా వెళ్లాడు. పైనుంచి పడుతోన్న మారేడు చెట్టునీడ, దేవతా సర్పంలా ముందుకు ప్రాకుతోంది. గోదావరి మీదనుంచి వస్తోన్న చల్లనిగాలి, జీవుడు మాయామోహితుడై ఆటలాడుకున్నట్లుగా, అటు యిటు తిరుగుతోంది. ప్రక్కనే ఈశ్వరాలయంముందు పాలవాళ్ళు గోక్షీరం పితుకుతున్న చప్పుళ్ళు...

అతను ఇంటికి తిరిగివచ్చాడు. వరండాలో వో మూలగా, సమస్త వస్తు సంభారమూ పెట్టబడివుంది. "ఇదేమిటి?" అన్నాడు లోపలినుంచి వస్తున్న ముసలమ్మను ఉద్దేశించి, ఇంకా ఆశ్చర్యంలోనుంచి పూర్తిగా తేరుకోకుండానే.

"నిన్న షాహుకారుతో నువు చెప్పావుటకదూ, ఇంట్లో బియ్యం నిండుకున్నాయనీ, ఉప్పూ పప్పూ అన్నీ పంపించమని"

"అవును. నేను వెళ్ళేసరికి చీకటిపడింది. నన్ను చూచేసరికే మొహం మాడ్చుకున్నాడు. నేను ఫలానా, ఫలానా కావాలనేసరికి జవాబే చెప్పలేదు. కొంచెంసేపు పూరుకుని 'రేపొద్దున్న చూద్దాంలెండి' అన్నాడు కంటుగా."

"ఇదిగో! ఇప్పుడు స్వయానా తనే పట్టుకొచ్చాడు. నువ్వు లేకపోవడంచూసి ఎంతగానో నొచ్చుకున్నాడు."

శ్రీమన్నారాయణకు అనిర్వచనీయమైనది అర్థమైనట్లనిపించింది. "లక్ష్మీ!" అన్నాడు ఆ పురిటిమంచం దగ్గరకు చేరి. లక్ష్మి కళ్ళలో వెలుగు, సంతృప్తి, ఏదో గర్వం. "అమ్మాయిని చూశారా?" అన్నది ఆ పసిగుడ్డును దగ్గరకు పొదువుకుంటూ. "ఎవర్ని? కళ్యాణినా? మనం దానిని చూడగిమేవిటిఁ? అదే మనని చూడాలికాని" లక్ష్మికి మాటలు అర్థంకాలేదు. భర్త యేదో పరాచిక మాడుతున్నాడనుకుని, పేలవంగా నవ్వి వూరుకొంది.